## ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

లాలాపేట: శాంతినగర్‌లోని తక్షశిల స్కూల్ పీపీ–2 చిన్నారి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఇండియా ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ ఈసీఓ గీతా భాస్కర్ హాజరై పీపీ–2 పూర్తి చేసిన చిన్నారి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తనుప్రీత్ కౌర్, డైరెక్టర్ భాగ్యలక్ష్మి, హెచ్‌ఆర్ భానుశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి, నాజ్మా, పాల్గొన్నారు.

## వయోపరిమితి పెంపునకు వినతి



కోదండరామ్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

లాలాపేట: టీఎస్‌పీఎస్సీ విడుదల చేసిన గ్రూప్–1 నోటిఫికేషన్‌తో పాటు రాబోయే ఉద్యోగ నోటిఫికేషన్లకు వయోపరిమితిని 46 నుంచి 51 ఏళ్లకు పెంచాలని ప్రజా తెలంగాణ, తెలంగాణ మేధావుల సంఘం నాయకులు శనివారం ప్రొ. కోదండరామ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. 2017 నుంచి తెలంగాణలో ఎలాంటి ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్లు విడుదల కాకపోవడంతో నిరుద్యోగులకు మేలు చేసేలా వయోపరిమితి పెంచే అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోదండరామ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మేధావుల సంఘం నాయకులు దునుకు వేలాద్రి, వెంకట్‌గౌడ్, స్థానిక నాయకులు వీరన్న పాల్గొన్నారు.

## కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

సనత్‌నగర్: హనుమాన్ దేవస్థానంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. వేద మంత్రోచ్చారణల నడుమ వేలాది మంది భక్తుల మధ్య కల్యాణ తంతును పండితులు జరిపించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సుజనరంజని వారిచే భక్తి సంగీత కార్యక్రమం భక్తులను అలరించింది. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం రుద్రహోమం, పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ఫలాలతో రసాభిషేకం, సాయంత్రం శివపార్వతుల ఊయ్యాల సేవ పవళింపు సేవ వైభవంగా జరిగాయి.

## గురుకుల అభ్యర్థుల కోసం న్యాయ పోరాటం

ఉస్మానియా యూనివర్సిటీ: గురుకుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల కోసం న్యాయ పోరాటం చేయనున్నట్లు ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డా.ఎల్చాల దత్తాత్రేయ శనివారం పేర్కొన్నారు. డీఎల్, జేఎల్, పీజీటీ, టీజీటీ తదితర 9 వేల ఉద్యోగాలకు 1:2 మెరిట్ ప్రకారం ఎంపికైనట్లు తెలిపారు. అయితే ఇందులో కేవలం 5 వేల మందికి ఉద్యోగాల నియామక పత్రాలు అందజేశారని మిగిలిన 4 వేల ఉద్యోగాలను పక్కన పెట్టారని వివరించారు. మిగిలిన 4 వేల ఉద్యోగాలను కూడా మెరిట్ అభ్యర్థులతో భర్తీ చేయాలని గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కొందరు అభ్యర్థులకు ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలకు ఎంపికయ్యారని వారు పెద్ద ఉద్యోగంలో చేరగా మిగతావి ఖాళీగా ఉంటున్నాయని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. గురుకుల నియామకాల విధానంలో లోపాలు ఉన్నందున ఉద్యోగాలకు ఎంపికైన నాలుగు వేల మందికి అన్యాయం జరుగుతుందని ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని కోరారు. గురుకుల ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు న్యాయం జరిగేందుకు కోర్టును ఆశ్రయించనున్నట్లు దత్తాత్రేయ పేర్కొన్నారు.

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 43, పచ్చకాకర 38, పందిరి బీర 35, క్యాబేజీ 21, క్యారెట్ 23, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 18, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

## వైభవంగా లింగోద్భవ పూజలు

కాచిగూడ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం అర్ధరాత్రి ఆలయాల్లో లింగోద్భవ పూజలు అత్యంత వైభవంగా జరిగాయి. కాచిగూడ డివిజన్ మోతీమార్కెట్, నెహ్రూనగర్, లింగంపల్లి, చెప్పల్‌బజార్, విక్రమ్‌నగర్, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో భక్తులు లింగోద్భవ వేళ దీపాలు వెలిగించి హారతులు ఇచ్చారు. సర్వేశ్వరుడు మహా లింగాకృతునిగా ఆవిర్భవించిన సమయాన్ని లింగోద్భవంగా ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించడం ఆనవాయితీగా. ఆయా ప్రాంతాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, వై.అమృత, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, బీఆర్ఎస్ నేతలు దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

## 'నమస్తే'పై కాంగ్రెస్ ఫిర్యాదు

సనత్‌నగర్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడులు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో రహస్య భేటీ అంటూ 'నమస్తే తెలంగాణ' పత్రికలో నిరాధార కథనాన్ని ప్రచురించారంటూ ఎమ్మెల్సీ, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలంగాణ స్టేట్ తరపున ఆర్థిక పరంగా సపోర్ట్ చేయాలని చంద్రబాబు..రేవంత్‌రెడ్డిని రిక్వెస్ట్ చేసినట్లుగా ఆ కథనంలో పేర్కొన్నారని, ఇదంతా అవాస్తవమని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ప్రతికపై కేసు నమోదు చేసినట్లు బేగంపేట ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.

# 'గాంధీ' మురుగు సమస్యకు మోక్షం లభించేనా?





గాంధీఆస్పత్రిలో లీకవుతున్న డ్రైనేజీ పైప్‌లైన్

**కోట్లు కేటాయించినా ముందుకురాని కాంట్రాక్టర్లు**

- ఆరుసార్లు టెండర్లు పిలిచినా ఫలితం శూన్యం
- మంత్రి చొరవతో కదిలిన ఇంజినీరింగ్ యంత్రాంగం
- ప్రతిపాదిత వ్యయం రూ. 19.60 కోట్లకు పెంపు

గాంధీ ఆస్పత్రి : తెలంగాణ వైద్యప్రదాయినీ సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో మురుగునీటి వ్యవస్థ ప్రక్షాళనకు కోట్లాది రూపాయల నిధులు కేటాయించినప్పటికీ సంబంధిత కాంట్రాక్టు సంస్థలు ముందుకు రాకపోవడం గమనార్హం. ఇటీవల గాంధీ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రధాన భవనంలోని పలు ప్రాంతాల్లో లీకవుతున్న మురుగునీటిని చూసి విస్మయానికి గురై తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు ప్రతిపాదిత వ్యయాన్ని రూ. 19.60 కోట్లకు పెంచుతూ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ వైద్య విద్య మౌలిక వసతుల కల్పన సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) గాంధీ మురుగునీటి వ్యవస్థ ప్రక్షాళన కోసం రూ. 14.56 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు ఆహ్వానించారు. ఆరుసార్లు టెండర్లు పిలిచినా సంబంధిత కాంట్రాక్టు సంస్థలు ముందుకు రాకపోవడంతో సమస్య పరిష్కారం కాలేదు. డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణ జరిగితే ప్రధాన భవన సెల్లార్‌లో లక్ష చదరపు అడుగుల విస్తీర్ణం అందుబాటులోకి వచ్చి మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వీలవుతోందని ఆస్పత్రి అధికారులు వివరించారు.

**లీకేజీలతో సర్జరీలు సైతం వాయిదా..**

రెండు దశాబ్దాల క్రితం ఇన్ పేషెంట్ విభాగ భవనాన్ని సెల్లార్ జీ–ప్లస్ ఎనిమిది అంతస్తుల్లో నిర్మించారు. భవనంలో 712 మరుగుదొడ్లు ఉండగా, అంతకు ఐదింతలు మంచినీటి పైపులైన్లు, నల్లాలు ఉన్నాయి. అప్పటి అవసరాలు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారు. ఆయా విభాగాల నుంచి వచ్చే మురుగు నీరు సెల్లార్ నుంచి పైప్‌లైన్ల ద్వారా బయటకు తరలించడం ఇంజినీరింగ్ తప్పిదంగా సంబంధిత నిపుణులు భావిస్తున్నారు. భవన నిర్వహణ వ్యవహారాలను గాలికి వదిలేశారు. రోగుల సంఖ్య గణనీయంగా పెరగడం, పైప్‌లైన్లు చిన్నవి కావడం, ఎలుకలు, పంది కొక్కులు తవ్వేయడం, పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరి మురుగు సమస్య ఉత్పన్నమైంది. ఏడాది పొడుగునా సెల్లార్ మొత్తం మురుగునీటితోనే నిండి ఉంటుంది. పై అంతస్తుల నుంచి నీళ్లు కారడంతో ఆపరేషన్ థియేటర్లలో సర్జరీలు సైతం పలుమార్లు వాయిదా పడ్డాయి. గాంధీ సెల్లార్‌లో మెడికల్ ఫార్మసీ, ఫిజియోథెరపీ, సెంట్రల్ స్టెరిలైజేషన్ డిపార్ట్‌మెంట్, లాండ్రీ, ఎలక్ట్రికల్, లోకల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజీ తదితర విభాగాలు కొనసాగుతున్నాయి.

**రూ.19.60 కోట్లకు పెంపు..**

పలుమార్లు టెండర్లు పిలిచినా సంబంధిత సంస్థలు ఎందుకు ఆసక్తి చూపలేదనే అంశంపై మంత్రి కోమటిరెడ్డి ఆరా తీయగా, తక్కువ వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడం, బిల్లుల చెల్లింపుల్లో జాప్యమే కారణమని తెలిసింది. అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని మంత్రి సంబంధిత ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రూ.14.56 కోట్ల నుంచి రూ.19.60 కోట్లకు పెంచుతూ ప్రతిపాదిత వ్యయన్ని టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు సవరించారు.

**ప్రక్షాళన ఇలా..**

ఎనిమిది అంతస్తుల్లో ప్రతి ఫ్లోర్ పైపులైన్లకు ప్రత్యేక వాల్వ్ ఏర్పాటు చేసి, డ్రైనేజీ వ్యవస్థను ఎక్కడికక్కడ నియంత్రిస్తారు.ప్రత్యేకంగా రూపొందించిన రసాయన మిశ్రమాలను సిమెంట్, ఇటుక గోడల్లోకి పంపించి లీకేజీలను నివారిస్తారు. అన్ని డ్రైనేజీ పైప్‌లైన్లు గ్రౌండ్ ఫ్లోర్‌లోనే కలిసేలా వ్యవస్థను ఏర్పాటు చేసి, అక్కడి నుంచే జీహెచ్ఎంసీ మెయిన్ డ్రైనేజీకి కలుపుతారు. డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు సమూలంగా తొలగించి, 300 డయాగ్రం కంటే పెద్ద పైప్‌లైన్లు నూతనంగా ఏర్పాటు చేస్తారు.

**మరోసారి టెండరు ప్రక్రియ..**

రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు గాంధీ మురుగునీటి వ్యవస్థ ప్రక్షాళనకు మరోమారు టెండర్లు పిలవనున్నట్లు టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు స్పష్టం చేశారు. నిర్మాణ వ్యయాన్ని రూ. 19.60 కోట్లకు పెంచుతూ ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వ ఆమోదం కోసం పంపినట్లు వివరించారు.

## ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా ఓటేయాలి



రాంగోపాల్‌పేట్: ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గోపాలపురం ఏసీపీ సుబయ్య అన్నారు. శనివారం గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్మీ సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రతి గల్లీలో కవాతు నిర్వహిస్తూ ఓటర్లకు తామున్నామనే భరోసాను కల్పించారు. ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటరు హక్కుకు ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సైలు రామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

**అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రాంతాల్లో ..**

అడ్డగుట్ట: రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నార్త్‌జోన్ పరిధిలోని తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో 110 మంది సీఆర్పీఎఫ్ పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈస్ట్ మారేడుపల్లి, మహేంద్రాహిల్స్, అడ్డగుట్ట, తుకారాంగేట్ పరిసర ప్రాంతాలు, ప్రధాన రోడ్డు, బస్తీలలో సైతం ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించేందుకు ఫ్లాగ్ మార్చ్ చేపట్టినట్లు తెలిపారు.



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

## ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం అందిస్తున్న నిమ్మ శంకర్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండికి చెందిన బొల్లం మురళి దంపతుల కుమార్తె సంగీత వివాహం ఖర్చుల నిమిత్తం పారిశ్రామికవేత్త మున్నూరు కాపు వసతి గృహం ట్రస్టుబోర్డు సభ్యుడు నిమ్మ శంకర్ రూ.11వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. సీతాఫల్‌మండిలోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నిమ్మ శంకర్ ఆర్థిక సహాయాన్ని అందించారు. సికింద్రాబాద్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు లింగిచెట్టి హన్మంతరావు పెళ్లికి అవసరమైన బియ్యంను అందించారు. ఇప్పటి దాకా 52 కుటుంబాలకు చెందిన యువతుల వివాహానికి రూ.11వేల చొప్పున ఆర్థిక సహాయం అందించిన నిమ్మ శంకర్‌ను సంఘం ప్రతినిధులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు చేర్యాల శ్రీనివాస్, కస్తూరి రాంమోహన్, కృష్ణ, మధు, ప్రభాకర్, మున్నూరు చందు, యాద రఘు పాల్గొన్నారు.

## సెల్‌ఫోన్లు చోరీ చేస్తున్న ముఠాలోని ఇద్దరు అరెస్టు



దీపక్‌కుమార్



రాజ్‌కుమార్

సనత్‌నగర్: సెల్‌ఫోన్ల చోరీ చేసే ముఠాలోని ఇద్దరిని బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్న ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఝార్ఖండ్‌కు చెందిన కొందరు ముఠాగా ఏర్పడి నగరంతో పాటు పలు రాష్ట్రాలలో సెల్‌ఫోన్లను చోరీ చేయడం వృత్తిగా పెట్టుకున్నారు. రద్దీ ప్రదేశాల్లో తిరుగుతూ సెల్‌ఫోన్లను చోరీ చేస్తుంటారు. ముఠాలోని దీపక్‌కుమార్, రాజ్‌కుమార్ సనత్‌నగర్‌లో ఉంటూ గత కొంతకాలంగా సెల్‌ఫోన్లను చోరీ చేస్తున్నారు. దొంగిలించిన సెల్‌ఫోన్లను మూడు నెలలకోసారి ఝార్ఖండ్‌కు వెళ్లి విక్రయిస్తుండేవారు. విశ్వసనీయ సమాచారం మేరకు బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు నిఘా పెట్టి నిందితులను పట్టుకుని వారి నుంచి రూ.5 లక్షల విలువ చేసే 12 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం సనత్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

## భువనగిరి టికెట్ కిరణ్‌కుమార్ రెడ్డికి కేటాయించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ టికెట్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయించాలని ఓయూ జేఏసీ నాయకులు నరేందర్ పవార్ కోరారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా పనిచేస్తూ ఆయన గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ఎంతో కృషి చేశారని ఆయన సేవలను గుర్తించి సీఎం రేవంత్‌రెడ్డితో పాటు అధిష్ఠానం గుర్తించి ఎంపీ టికెట్‌ను కిరణ్‌కుమార్‌రెడ్డికి కేటాయిస్తే ఓయూ జేఏసీ తరపున భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు.

## మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలి



సీతాఫల్‌మండిలో ప్రచారం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ బీదల బస్తీ మైదానంలో ఈనెల 10న నిర్వహించనున్న ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి బొర్ర భిక్షపతి మాదిగ కోరారు. బీదలబస్తీ సభను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం సీతాఫల్ మండి డివిజన్‌లో పాదయాత్రలు నిర్వహించిన ఎంఆర్‌పీఎస్ ప్రతినిధులు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాదిగ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల చట్టం అమలు, సమకాలీన రాజకీయ పరిస్థితులకు సంబంధించిన అంశాలను బీదలబస్తీ సభలో మాట్లాడుతారని ఆయన చెప్పారు. సికింద్రాబాద్ ప్రాంతంలోని మాదిగ, ఉప కులాల ప్రతినిధులు, ప్రజాస్వామిక వాదులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డప్పు మల్లికార్జున్ మాదిగ, నందారం సీతారాం, విజయ, రాజేశ్, మహేశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## రాజ్యాంగబద్ధ హక్కుల అమలు ఏదీ?

**డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్**

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దళితులు, ఆదివాసీలకు రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన హక్కులు అమలు కావడం లేదని అందులో తెలంగాణ రాష్ట్రం పూర్తిగా వెనుకబడిపోయిందని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిటిజన్స్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ( సీవీఎంసీ) ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్టు దాని అమలు తీరు అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ... కేసీఆర్ వచ్చాక ఎస్సీ, ఎస్టీతో పాటు మానవ హక్కుల కమిషన్ కూడా నిర్వీర్యం అయిందని ఆరోపించారు. గతంలో ఐపీఎస్ అధికారులను సైతం కమిషన్ వారు నిలదీసి అడిగే వారని ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రైతులు, కాళేశ్వరం, ధరణి గురించి మాట్లాడటం తప్ప దళితుల గురించి మాట్లాడటం లేదన్నారు. ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అట్రాసిటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నర్సింహా, పీఎంసీ రాష్ట్ర కన్వీనర్ శివలింగం, దళిత సేనా వ్యవస్థాపకులు జె.బి.రాజు, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ ఇ.ఆనందం, సీడబ్ల్యూపీ మాజీ చైర్మన్ శ్యామలదేవి, సీనియర్ అడ్వకేట్ భూపాల్, పులి కల్పన తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉమెన్స్ డే వేడుకలు



లాలాపేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో ఉమెన్స్ డే వేడుకలను నిర్వహిస్తున్నట్లు ప్రెసిడెంట్ డా. పి. మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4. 30లకు ప్రారంభమయ్యే వేడుకలకు తెలంగాణ హైకోర్టు జడ్జి సూరేపల్లి నందా ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

## నీటి చౌర్యం.. అధికారుల చోద్యం

**ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో పబ్లిక్ నల్లాలకు మోటార్ బిగించి స్వప్రయోజనాలకు వినియోగం**

- జలమండలి ఆదాయానికి గండి



ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ఎంట్రన్స్ వద్ద..



బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఉన్న పబ్లిక్ నల్లా

సనత్‌నగర్: ప్రజావసరాల కోసం వేసిన తాగు నీటి నల్లాలను కొంతమంది తమ వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. గతంలో బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో అందరికీ నీటి సరఫరా చేయాలనే ఉద్దేశంతో పబ్లిక్ నల్లాలను ఏర్పాటు చేశారు. ఉదయం నీటి సరఫరా కాగానే బస్తీవాసులంతా నీటిని పట్టుకునేవారు. ప్రస్తుతం ఇంటింటికీ నల్లా కనెక్షన్ రావడంతో పబ్లిక్ నల్లాల వినియోగం లేదు. అయితే కొంతమంది వాటికి మోటార్లు బిగించి తమ వ్యక్తిగతంగా వాడుకుంటూ జలమండలి ఆదాయానికి గండి కొడుతున్నారు. బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీ ప్రభుత్వ పాఠశాల ఎదురుగా ఒకటి, బస్తీ ఎంట్రన్స్ వద్ద మరొకటి పబ్లిక్ నల్లాలు ఉన్నాయి. గత ఐదేళ్లుగా వాటికి మోటార్లను బిగించి యథేచ్ఛగా నీటిని తోడేస్తున్నారు. కొంతమంది ఏకంగా కమర్షియల్ అవసరాలకు ఉపయోగించుకోవడం, మరికొంతమంది వాహనాలు కడగడం.. ఇతరత్రా అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. ఓ వైపు అందరికీ నల్లా సౌకర్యం ఉండగా, ఇంకోవైపు మోటార్ల సహాయంతో ఈ పబ్లిక్ నల్లాల నుంచి నీటిని లాగేస్తుండడంతో సమీప ఇళ్ల నివాసితులకు లో ప్రెషర్‌తో నీటి సరఫరా అవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కో నల్లా నుంచి రోజుకు దాదాపుగా 4–5 వేల లీటర్ల వరకు నీటిని మోటార్ల ద్వారా లాగేస్తున్నారు. పబ్లిక్ నల్లాలు కావడంతో వాటికి సంబంధించిన బిల్లులు ఉండవు. దీంతో దొరికిందే ఛాన్స్ అన్నట్లుగా తమ వ్యక్తిగత నల్లాలను పక్కనబెట్టి ఈ నల్లాల ద్వారా నీటిని సేకరిస్తున్నారు. ఐదు వేల లీటర్ల ట్యాంకర్ నీటిని కొనాలంటే జలమండలి వారు రూ.800 వరకు వసూలు చేస్తున్నారు. అదే కమర్షియల్ అవసరాలకు అయితే దానికి రెట్టింపు స్థాయిలో చెల్లించాల్సి ఉంటుంది. అలాంటిది ఇక్కడి పబ్లిక్ నల్లాల నుంచి మంచినీరు వదిలిన ప్రతిసారీ ఐదు వేల లీటర్ల వరకు నీటిని లాగేస్తున్నట్లు సమాచారం. అంటే కమర్షియల్ మంచి నీటి ట్యాంకర్ అయితే జలమండలి కట్టే ఆ నీటి విలువ రూ.1600 అన్నమాట. రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా జరిగినా నెలలో 15 రోజులకు రూ.20 వేల పైచిలుకు నష్టం ఇక్కడి ఒక్క పబ్లిక్ నల్లాతో జరుగుతుంది. అదే రెండు పబ్లిక్ నల్లాలు అయితే నెలకు రూ.40 వేల పైచిలుకు నష్టం వాటిల్లుతోంది. బస్తీకి చెందిన పలువురు ఇక్కడి పబ్లిక్ నల్లాల ద్వారా జరుగుతున్న అక్రమ నీటి సరఫరాపై జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా పట్టించుకోలేదని వాపోయారు. ఒక పబ్లిక్ నల్లా నుంచి వచ్చే నీటిని సమీప హోటల్ అవసరాలకు వాడుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇక్కడి పబ్లిక్ నల్లాలపై దృష్టి సారించి అక్రమంగా మోటార్లు బిగించి నీటిని లాగేస్తున్న దందాకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

## మహిళలు ఉన్నతంగా ఎదగాలి

రాంగోపాల్‌పేట్: మహిళలు అందివచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటూ ఉన్నతంగా ఎదగాలని హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ బిషప్, కార్డినల్ రెవరెండ్ పూల ఆంథోని అన్నారు. శనివారం ఎస్డీరోడ్‌లోని హాస్ భవనంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకలు, హాస్ గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. బాలికలు, మహిళల విద్యకు ప్రాధాన్యమిచ్చి వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఎన్నో రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మహిళలకు అన్ని విధాల సహాయ సహకరాలు అందిస్తున్న హాస్‌కు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐజీ డైరెక్టర్ అర్చన సురేష్, వియ్ హబ్ సీఈవో దీప్తీరావు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న కార్డినల్ రెవరెండ్ పూల ఆంథోని